క్లుప్తంగా

ఆకట్టుకున్న కళాప్రదర్శన



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

వేములవాడ/వేములవాడరూరల్: జిల్లాకు చెందిన ఒగ్గుడోలు కళాకారులు విశాఖపట్నం కళాభారతి ఆడిటోరియంలో ఒగ్గుడోలు కళను ప్రదర్శించారు. నటరాజ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ, తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో వైశాఖీ జాతీయ నృత్యోత్సవం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ వేడుకకు ఆతిథ్య ప్రదర్శనగా ఈ ఒగ్గుడోలు బృందానికి ప్రత్యేక ఆహ్వానం అందింది. టీమ్ లీడర్ రవికుమార్ సారథ్యంలో 21 మంది కోడె ఒగ్గుల బృందం సభ్యులు ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం రవికుమార్‌ను వైశాఖీ యువపురస్కారంతో సత్కరించారు. ఈ బృందంలో వేములవాడకు చెందిన కాజర్ల బుగ్గయ్య సైతం పాల్గొన్నారు.

రాజన్న సేవలో సినీ నటుడు సత్యం రాజేశ్



వేములవాడ: వేములవాడ రాజన్నను సినీ నటుడు సత్యం రాజేశ్ శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం చేశారు.

సైబర్ మోసాలపై అవగాహన



తంగళ్లపల్లి: మండలంలోని లక్ష్మీపూర్‌లో తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన ఎన్ఎస్ఎస్ క్యాంపు శనివారం రెండో రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు సైబర్ మోసాలు, భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ వాణిశ్రీ, కళాశాల అధ్యాపకులు ఎల్.అనూష, ఎం.సంధ్యారాణి, సుమతి, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫొటోగ్రాఫర్లు

ముస్తాబాద్: ఫొటోగ్రాఫర్లు ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని ఫొటోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు బద్దిపడిగె నందు అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే ఫొటో ఎక్స్‌పో వాల్‌పోస్టర్లను మండలకేంద్రంలో శనివారం ఆవిష్కరించారు. ఫొటోగ్రాఫర్లు అంజి, దుబ్బాక రాజు, శ్రీకాంత్, వెంకటేశ్, వేణు, రమేశ్, జాషువా తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి మెట్ల నిర్మాణం

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల కట్ట మైసమ్మ ఆలయానికి రూ.లక్ష సొంత ఖర్చుతో కట్ట మైసమ్మ యూత్ సభ్యులు మెట్లు నిర్మించారు. మాజీ సర్పంచ్ మాట్ల మధు యూత్ సభ్యులను అభినందించారు. నేరెళ్ల సింగిల్‌విండో చైర్మన్ కోడూరి భాస్కర్ గౌడ్, మాజీ చైర్మన్ పబ్బతి విజయేందర్ రెడ్డి, డైరెక్టర్ గణేశ్, అనిల్ రెడ్డి, కుల సంఘం పెద్దలు కపరవేని మల్లయ్య, కందుకూరి పర్శరాం గౌడ్, కనకయ్య, కాంగ్రెస్ నాయకులు మనోజ్ గౌడ్, కట్ట మైసమ్మ యూత్ అధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

పీడీఎస్ బియ్యం పట్టివేత



బోయినపల్లి: మండలకేంద్రంలోని ఓ పాత ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం పట్టుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ శనివారం తెలిపారు. బోయినపల్లిలోని ఓ ఇంట్లో పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ చేశారన్న సమాచారం మేరకు తనిఖీలు చేయడంతో కోనరావుపేట మండలం కొండాపూర్‌కు చెందిన పెద్దగంటి అంజయ్య నిలువ చేసినట్లు గుర్తించారు. అంజయ్యపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సిరిసిల్లటౌన్: పోటీ ప్రపంచంలో రాణించాలన్న తపనతో ఎంచుకుంటున్న క్రీడల్లో ఆర్చరీపై కొందరు విద్యార్థులు మక్కువ చూపుతున్నారు. చదువులో లక్ష్యం సాధించాలన్నా, విలువిద్యలో రాణించాలన్న గురి తప్పకూడదన్న విశ్వాసంతో ముందుకెళ్తున్నారు. ప్రాచీన విలువిద్య (ఆర్చరీ)కి ఇప్పుడు మరింత ఆదరణ పెరుగుతోంది. చిన్నారులు విలు విద్యపై శిక్షణ పొందుతున్న వైనంపై సండే స్పెషల్ కథనం..

‘గురి’ పెడతాం..

- విలు విద్యపై విద్యార్థుల మక్కువ
- అటు చదువు..ఇటు ఆర్చరీపై సాధన
- జిల్లాకేంద్రంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు

సండే స్పెషల్



సిరిసిల్ల మినీస్టేడియంలో ఆర్చరీ శిక్షణ తీసుకుంటున్న బాలురు

జిల్లాకేంద్రంలో శిక్షణ

జిల్లాకేంద్రంలో విద్యార్థులకు విలువిద్యపై శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు ఏకాగ్రత, ఆటవిడుపు కోసం, క్రీడలో నిష్ణాతులయ్యేందుకు విలువిద్యను అభ్యసిస్తున్నారు. అటు చదువుకుంటూనే ఇటు క్రీడలపై ఆసక్తి కనబర్చే విద్యార్థులు కొందరు ప్రాచీన విలువిద్యను ఇష్టపడుతున్నారు. మారిన కాలంతో పాటు విలువిద్యను కూడా ఆధునిక పద్ధతుల్లో చిన్నారులకు శిక్షకులు నేర్పిస్తూ వారిని రాష్ట్రీయ, జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నారు.

‘గురి’ తప్పని ప్రదర్శన

విద్యార్థులు అభ్యసిస్తున్న విలువిద్యలో గురి తప్పకుండా నిత్యసాధన చేస్తున్నారు. జిల్లా కేంద్రం సిరిసిల్లలో మినీస్టేడియం, ప్రభుత్వ కళాశాల మైదానంలో ఆర్చరీ గేమ్‌ను ఆరేళ్లుగా బ్యాచులు వారిగా శిక్షకులు నేర్పిస్తున్నారు. చదువుల్లో పోటీపడే విద్యార్థులు ఏకాగ్రత, మానసిక ఉల్లాసాన్ని కలిగించే ఆర్చరీలో ఆరితేరుతున్నారు. శిక్షకులు ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులకు బ్యాచుల వారిగా ఉచిత శిక్షణ అందిస్తున్నారు. ఆర్చరీ జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో ఒకటి కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలకు భారతీయ సంప్రదాయ విలువిద్య(ఆర్చరీ) నేర్పించడానికి ఇష్టపడుతున్నారు. క్రీడాస్థలంలో విద్యార్థుల ప్రదర్శనను హర్షిస్తూ.. పట్టణ వాసులు మురిసిపోతున్నారు. జానపద కళారూపాల్లో ఒకటిగా ప్రసిద్ధి గాంచిన విలువిద్యకు ఇప్పుడు ఆధునిక నాగరికత ఆర్చరీ గేమ్‌గా ఆదరణ పెరుగడం విశేషం. ఆరేళ్లుగా సిరిసిల్లలో కొనసాగుతున్న విలువిద్యలో చిన్నారలు నిష్ణాతులై రాష్ట్రీయ, జాతీయ పోటీల్లో రాణించడంతో జిల్లా వాసుల నుంచి హర్షం వ్యక్తమైతుంది.

పతకం సాధించా



మాది సిరిసిల్ల సుభాష్‌నగర్. నాలుగేళ్లుగా ఆర్చరీ కోసం శిక్షణ తీసుకుంటున్నా. 2023 విజయవాడలో జరిగిన మినీ నేషనల్‌లో అండర్ 9 కేటగికరీలో సిల్వర్ మెడల్ సాధించా. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. చదువుల్లో పోటీతత్వం అలవడేందుకు ఈ క్రీడ ఉపయోగపడుతుంది.

– వాసం సుచిత్, 7వ తరగతి

నాన్న ప్రోత్సాహంతో



నాన్న ప్రోత్సాహంతో రోజూ ఉదయమే మినీ స్టేడియంలో విలువిద్యపై సాధన చేస్తున్నా. ట్రైనర్స్ బుర్రవేణి హరి, ఆడెపు మహేందర్ శిక్షణ ఇస్తున్నారు. జిల్లానుంచి రాష్ట్ర స్థాయికి మూడుసార్లు ఎంపికై గతేడాది రజత పతకం సాధించా. ఆర్చరీతో ఏకాగ్రత పెరిగి చదువుల్లో రాణించొచ్చు.

– వంకాయల నందన్‌సాయి, 8వ తరగతి

ఆర్చరీ అకాడమీ మంజూరు



జిల్లాకు ఆర్చరీ అకాడమీ మంజూరైంది. రోజూ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. సెలవు దినా ల్లో విద్యార్థుల సంఖ్య రెట్టింపు అవుతుంది. ప్రభుత్వం ఆ ర్చరీ అకాడమీకి నిధులు కే టాయించి పనులు పూర్తిచేస్తే క్రీడాకారులకు మ రిన్ని వసతులతో శిక్షణ ఇవ్వొచ్చు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుంది.

– బుర్రవేణి హరీశ్, ఆర్చరీ కోచ్



బోయినపల్లి: బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే రోడ్డులో పెట్రోల్ బంక్ ఎదురుగా రోడ్డును ముళ్లచెట్లు కమ్మేశాయి. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఒక్కోసారి వాహనదారులకు ముళ్లకంప తగిలి ప్రమాదాలు జరిగిన సంఘటనలున్నాయి. వెంటనే రోడ్డుపైకి వస్తున్న ముళ్ల చెట్లను తొలగించాలి.

– ముద్దం ప్రసాద్, బూర్గుపల్లి

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : సాయితేజ
పీఆర్, ఏఈ, బోయినపల్లి, సెల్ 9849781096

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రమరించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రమరిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

రాజీనామా చేసి ఎన్నికల్లో గెలవండి



సిరిసిల్లటౌన్: బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచిన పదిమంది ఎమ్మెల్యేలు వెంటనే ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి ఎన్నికల్లో గెలవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని తెలంగాణ భవన్ సమీపంలో పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో చేరి తాము పార్టీ మారలేదంటూ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్‌లోనే ఉన్నామనడం ప్రజలు అసహ్యించుకుంటున్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.కే. అఫ్రోజ్, బూత్కూరి శివరాజ్, కోడం వెంకటేశం, ముద్దం అనిల్ గౌడ్, అందే సుదర్శన్, హరీశ్, శ్రీనివాసరావు జగన్, నరేశ్, రాము తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీవి కుట్రపూరిత రాజకీయాలు

- సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయమనే బీఆర్ఎస్, బీజేపీలు కుట్రపూరిత రాజకీయాలు చేస్తూ కాంగ్రెస్‌పై దుష్ప్రచారం చేస్తున్నాయని సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు కేటీఆర్‌ను ఉద్దేశించి పలు వ్యాఖ్యలు చేసిన కల్వకుంట్ల కవిత ఇప్పుడు హరీశ్‌రావు, సంతోష్‌రావు పైనే వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన యూరియా వాటా పూర్తిగా రాలేదని పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో యూరియా కొరత లేకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రజల్లో ఉనికి కోసం దిగజారుడు రాజకీయాలకు ఆపార్టీలు తెరలేపాయని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఓట్ల కోసం ఎన్ని కుయుక్తులు పన్నినా రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆపార్టీలకు తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చొప్పదండి ప్రకా శ్, ఆడెపు చంద్రకళ, గడ్డం నర్సయ్య, సూర దేవరాజు, చల్ల హరికృష్ణ, బొద్దుల శ్రీనివాస్, రాగుల జగన్, బైరినేని రాము తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరినవారితో విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట: మండలకేంద్రంతో పాటు పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మండల ప్రాథమిక వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్, మాజీ ఎంపీపీ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అబ్బాసాని శంకర్ గౌడ్, మర్రిమడ్ల తాజా మాజీ సర్పంచ్ మాట్ల అశోక్, కొలనూరు సింగిల్‌విండో డైరెక్టర్ ఇప్ప రాములు, మాజీ వార్డు సభ్యులు శంకరవ్వ, బొడ్డు కిషన్‌తోపాటు సుమారు 20 మంది నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కిరాణ దుకాణాల్లో తనిఖీ

వీర్నపల్లి: గంజాయి విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై వేములవాడ లక్ష్మణ్ అన్నారు. శనివారం మండలంలోని గర్జనపల్లిలో పలు కిరాణా దుకాణాలను తనిఖీ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇటీవల గ్రామాల్లో యువకులు గంజాయి విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినందున కిరాణా దుకాణాలు తనిఖీ చేసి అక్కడున్న ఇద్దరిని పరీక్షించినట్లు పేర్కొన్నారు.

ఇసుక రవాణాదారుడి రిమాండ్

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒకరిని శనివారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి చెందిన గూడూరి మనోహర్ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా దాడి చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. మనోహర్‌పై కేసు నమోదు చేసి, 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



చందుర్తి : మాట్లాడుతున్న బండ మల్లేశం

చందుర్తి: ప్రధాని మోదీ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బండ మల్లేశం కోరారు. మండలకేంద్రంలో తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమాలపై కార్యాచరణ సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు మోకిలే విజేందర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవంతో పాటు మోదీ జన్మదిన వేడుకల సందర్భంగా చేపట్టాల్సిన పార్టీ కార్యక్రమాలను గ్రామగ్రామాన చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు సిరికొండ శ్రీనివాస్, వేములవాడ నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు పోంచెట్టి రాకేశ్, నాయకులు మర్రి మల్లేశం, గంగరాజు, లోకోజీ సతీశ్, గడిగొప్పుల జీవన్, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ అర్బన్ బీజేపీ అధ్యక్షుడు మండల బుర్ర శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లాడి రమేశ్, లింగంపల్లి శంకర్, చింతపల్లి మోహన్‌రావు, జింక అనిల్, చంద్రగిరి ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

గంభీరావుపేట: కేంద్ర ప్రభుత్వ పథకాలను పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు అన్నారు. గంభీరావుపేట మండల సేవా పక్ష సమావేశం బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేశ్ ఆధ్వర్యంలో జరిగింది. మండల మాజీ అధ్యక్షుడు గంట అశోక్, నాయకులు పత్తి స్వామి, శ్రీనివాస్‌చారి, ఎలేందర్, విగ్నేష్‌గౌడ్, మల్లేశ్ యాదవ్, రాజు, స్వామి, సర్వోత్తం, దేవేందర్‌గౌడ్, దేవేందర్ యాదవ్, నర్సింలు, చంద్రం యాదవ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నలా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించాలన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, జూకంటి అఖిల్, ఇటికల రాజు, కోసిని వినయ్, రెడ్డిమల్ల ఆశీర్వాద్, కోడం భవిత, ఇటికల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: బీజేపీ సేవాపక్షం విజయవంతం చేయాలని ఆ పార్టీ పార్లమెంట్ కో కన్వీనర్ ఆడెపు రవీందర్ కోరారు. మండలకేంద్రంలో బీజేపీ సేవాపక్షం కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ జన్మదినం సందర్భంగా 17 నుంచి అక్టోబర్ 2 వరకు సేవా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మండలశాఖ అధ్యక్షుడు సొల్ల క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శి ఎదునూరి గోపి, అసెంబ్లీ కన్వీనర్ కొరెడ్ల మల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, సేవ పక్షం మండల కన్వీనర్ శ్రీకాంత్, సంజీవ్, శంకర్, సత్తయ్య, శ్రీనివాస్‌రావు, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో సేవాపక్షం మండల కార్యశాల ఏర్పాటు చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు రేపాక రామచంద్రారెడ్డి అన్నారు. జిల్లా కార్యదర్శి మద్దుల బుగ్గారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బందారపు లక్ష్మారెడ్డి, నాయకులు నంది నరేశ్, దాసరి గణేశ్, లక్ష్మణ్, కిరణ్‌నాయక్, శ్రీశైలం, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘టెట్’ తీర్పుపై ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాలి



మాట్లాడుతున్న టీచర్స్ యూనియన్ నాయకులు

వేములవాడరూరల్: టెట్ తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాలని తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు భీమనాథుని రవి కోరారు. వేములవాడలో శనివారం నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. 2011కు ముందు నియమితులైన 70వేల మందికి పైగా టీచర్లపై ఈ తీర్పు ప్రభావం చూపుతుందన్నారు. వీరికి టెట్ నుంచి మినహాయింపు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించాలని కోరారు. సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, రాష్ట్ర బాధ్యులు రవీందర్‌రెడ్డి, యాదగిరి, పీఆర్సీ కమిటీ సభ్యుడు కందుకూరి దయానంద్, అసోసియేట్ అధ్యక్షుడు అరుకుటి మల్లేశం, రాష్ట్ర నాయకులు చాట్ల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నూతన కమిటీ

జిల్లా నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా రేవోజు సదానందం, ప్రధాన కార్యదర్శిగా మొగిలి లక్ష్మణ్, ఆర్థిక కార్యదర్శిగా బొగ్గారపు నవీన్ నియమితులయ్యారు.

యూరియా కోసం పడిగాపులు



ఇల్లంతకుంట: దాచారం రైతువేదిక ముందు శనివారం ఉదయం నుంచి ఆధార్‌కార్డులతో లైన్



వీర్నపల్లి : రైతువేదిక వద్ద టోకెన్ల కోసం గుమిగూడిన రైతులు

సిరిసిల్లఅర్బన్/వేములవాడ అర్బన్/ఇల్లంతకుంట/వీర్నపల్లి: యూరియా కష్టాలు రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. గంటల కొద్ది క్యూలైన్‌లో వేచి ఉంటే ఒకే బస్తా ఇస్తుండడంతో సరిపోక మరుసటి రోజు మళ్లీ లైన్ కడుతున్నారు. దీంతో అన్నదాతలకు నిత్యం యూరియా కోసం నిలబడడం తప్పడం లేదు. సిరిసిల్ల పట్టణ పరిధిలోని చంద్రంపేట రైతువేదిక వద్ద శనివారం రైతులు, అధికారులతో వాగ్వాదానికి దిగారు. 400 బస్తాలు రావడంతో ముందుగా వచ్చిన రైతులకు పంపిణీ చేశారు. దీంతో మిగతా వారు ఆందోళనకు దిగారు. ఇల్లంతకుంట మండలం దాచారం రైతువేదికకు 440 బస్తాలు రావడంతో విషయం తెలుసుకున్న రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. చెప్పులు, బట్టసంచులు, ఆధార్‌కార్డులను క్యూలైన్‌లో పెట్టారు. ఎకరంనర లోపు ఉన్న రైతులకు ఒక బస్తా, ఎకరంనర పైన ఉన్న వారికి రెండు యూరియా బస్తాలు చొప్పున పంపిణీ చేసినట్లు దాచారం ఏఈవో అర్చన తెలిపారు. వీర్నపల్లి మండలంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలోకి యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు తెల్లవారకముందే భారీగా తరలివచ్చారు. రైతువేదిక వద్ద టోకెన్లు ఇస్తామనడంతో రైతులందరు అక్కడికి పరుగులు తీశారు. అక్కడికి వచ్చిన వ్యవసాయాధికారి జయతో రైతులు వాగ్వాదానికి దిగారు. ఎస్సై వేముల లక్ష్మణ్ రైతులను క్యూలైన్‌లో నిల్చోబెట్టారు. ఆధార్‌కార్డుపైన ఒక్కోరైతుకు ఒక్కో బస్తాకు రూ.300 వసూలు చేస్తుండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వేములవాడలోని గ్రోమోర్ ఎరువుల దు కాణం ఎదుట రైతులు వేకువజామున నుంచే క్యూ లైన్‌లో నిల్చున్నారు. గంటల తరబడి నిలబడటం ఇబ్బందిగా ఉండడంతో రైతులు క్యూలైన్‌లో చెప్పులు, బండరాళ్లు పెట్టారు. 300 బస్తాలు రాగా ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేశారు.

గల్ఫ్ కార్మికులకు అండగా ప్రభుత్వం

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ ప్రభుత్వం గల్ఫ్ కార్మికులను ఆదుకుంటుందని, ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతే కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షల బీమాను అందిస్తున్నట్లు ప్రముఖ ఎన్నారై, మండల గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు లాల్ మహమ్మద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. రాచర్లగొల్లపల్లిలో శనివారం జెండా ఆవిష్కరించారు. సిరిసిల్ల, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, నిజామాబాద్ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది బతుకుదెరువుకోసం కోసం వెళ్తున్నారన్నారు. ఉద్యోగాలు దొరుక్కఎంతో మంది రోడ్డుపాలవుతున్నారన్నారు. అలా జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణను తీసుకుటుందన్నారు. సివిల్ ప్రొటెక్షన్ లీగల్ సర్వీసెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, మండల అధ్యక్షుల లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, శ్రీనివాస్‌రెడ్డి, మార్పు సంజీవ్‌రెడ్డి, చేపూరి రాజేశం, బుచ్చాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ల పరికరాలు అపహరణ

ఎల్లారెడ్డిపేట: వారసంతలో సరుకులు కొనేందుకు వచ్చిన వారి బైక్‌ల పరికరాలు దొంగలు ఎత్తుకెళ్లారు. మండలకేంద్రంలో శుక్రవారం వారసంతకు వచ్చిన వారు ఒకచోట బైక్‌లు పార్క్ చేయగా నలుగురి బైక్‌ల పరికరాలు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. ఈ మేరకు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంతకు వచ్చే వారికి రక్షణ కల్పించాలని పలువురు కోరారు.

రైతును మోసం చేసిన వ్యక్తిపై కేసు

ముస్తాబాద్: రైతును మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని కొండాపూర్‌కు చెందిన మంద మల్లారెడ్డికి చెందిన 5.13 ఎకరాల భూమిని హైదరాబాద్‌కు చెందిన ఫిషహాట్ చారీకి విక్రయించాడు. అయితే రిజిస్ట్రేషన్ సమయంలో మల్లారెడ్డికి చెందిన మరో 16 గుంటల స్థలాన్ని కూడా బాండ్ పేపర్‌పై రాసుకుని హట్‌చారి పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. 16 గుంటల స్థలానికి సంబంధించిన డబ్బులు చెల్లించకుండా, కాలయాపన చేసిన హట్‌చారిపై మల్లారెడ్డి ఫిర్యాదు చేశాడు. చారిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లికి చెందిన మల్యాల నాగవ్వ (65) చికిత్స పొందుతూ మృతిచెందింది. నాగవ్వ ఈనెల 10న ఇంటిలో కాలుజారి కిందపడిపోగా కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కూతురు తనుగుల పద్మ ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


కేలోత్ తండాను గ్రామ పంచాయతీగా మార్చండి



మాట్లాడుతున్న గిరిజనులు

వీర్నపల్లి: మండలంలోని వన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కేలోత్ తండాను గ్రామపంచాయతీగా మార్చాలని కేలోత్ రాజం ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తండా గిరిజనులు మాట్లాడుతూ... తండాలో 202 కుటుంబాలున్నాయని, దాదాపు 500 పైచిలుకు జనాభా కలిగిన తండాను ప్రభుత్వం గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఆలయ చైర్మన్ జగన్, నరహరి, రాజేందర్, తిరుపతి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ నిర్మాణ్ భవన్ నమూనా విడుదల



సిరిసిల్లకల్చరల్: జిల్లాకేంద్రంలో నూతనంగా నిర్మించనున్న న్యాయ నిర్మాణ్ భవన్ (కోర్టు) నమూనా విడుదలైంది. రెండు వైపులా ఐదేసి అంతస్తులతో పాటు సెల్లార్‌లో మరో రెండు ఫ్లోర్లతో అత్యాధునిక సౌకర్యాలతో కోర్టు భవనం నిర్మాణం కానుంది. రెండు రోజులుగా సామగ్రి తరలింపు ప్రక్రియ మొదలైంది. దసరా తర్వాత నిర్మాణ పనులు మొదలుకానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం ఇప్పటికే టెండర్ పనులు పూర్తి చేసింది. రూ. 81.26 కోట్ల నిధులు విడుదల చేసింది. మొత్తం 2, 18,763 చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనాన్ని నిర్మించనున్నారు. రెండేళ్లలో తాత్కాలికంగా కొన్ని కోర్టులు అద్దె భవనాల్లో కొనసాగుతాయి. సోమవారం నుంచి అద్దె భవనాల్లో కోర్టు వ్యవహారాలు ప్రారంభమవుతాయి.